## సింగిల్ పేజీ కథ

# నమ్మకం

**-నందివాడ నిర్మల శాంతకుమారి**

బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆ మెడికల్ షాప్ ఎప్పుడూ బిజీగా ఉంటుంది. వచ్చిన కస్టమర్స్ అందరికీ ఒక్కొక్కరికీ మందులు ఇచ్చి పంపిస్తున్నాడు మురళి. అందరినీ పంపించి ఇంకా అక్కడే నిల్చుని ఉన్న ఒక పదహారేళ్ళ కుర్రవాణ్ణి చూశాడు.

అతడు వచ్చి చాలా సేపయింది. ఏదో అడగాలని తటపటాయిస్తున్నాడు. అతడు దేనికో సంకోచపడు



తున్నాడని గ్రహించాడు మురళి

'ఏం కావాలి బాబూ?' అని అడిగాడు మురళి.

'మీ దగ్గర నిద్రరాకుండా మాత్రలు ఉన్నాయా సార్. నేను పదవ తరగతి చదువుతున్నాను. పరీక్షలు దగ్గరకు వచ్చాయి. పుస్తకం ముట్టేనే నిద్రొస్తోంది' కొంచెం సిగ్గుపడుతూ అడిగాడు.

'మాత్రలు అలవాటు చేసుకోకూడదు బాబూ, పట్టుదలగా చదివితే నిద్ర నీజోలికే రాదు.'

'లేదండీ ఎంత పట్టుదలగా ఉన్నా నిద్ర ముంచుకొస్తోంది. నేను స్కూలులో చాలా వెనుకబడి ఉన్నానండీ, అందరూ నన్ను హేళన చేస్తున్నారు. పాస్ కాకపోతే మా తలిదండ్రులు కూడా ఊరుకోరు. ఏ షాపులో అడిగినా అసలు మందులే లేవంటున్నారు.' దీనంగా చెప్పాడు ఆ విద్యార్థి.

మురళికి జాలేసింది. కొన్ని టాబ్లెట్స్ తీసి ఇచ్చాడు.

'ఎలా వేసుకోవాలి సార్' ఆ మాత్రల వంక చూస్తూ అడిగాడు.

'రోజూ రెండు వేసుకోవాలి' డబ్బులు తీసుకుంటూ చెప్పాడు మురళి.

'ఎంతసేపు మెలకువగా ఉండగలను? చదవగలనా?' సంశయాత్మకంగా అన్నాడు.

'తప్పకుండా, నీవెంత సేపు చదవాలనుకుంటే అంతసేపు మెలకువగా ఉంటావ్. పడుకుంటే మటుకు నిద్రవస్తుంది' చెప్పి, వేరే చీటీ వస్తే అటువైపు చూశాడు.

'పోనీలెండి పూర్‌ఫెలో, పైగా ఈ సంవత్సరమంతా వేస్టవుతుంది.' జాలిగా చెప్పాడు మురళి.

\+ + + +

'హలో సార్, మెనీ మెనీ థాంక్స్ సార్. మీ దయవల్ల పదోతరగతి పాసయ్యాను. ఆర్డినరీ పాసే అనుకోండి. మీ మాత్రలు బాగా పనిచేశాయి. అసలు నిద్రరానేలేదు.' చాలా ఉత్సాహంగా చెప్పి, మురళికీ, ప్రొప్రైటరుకీ స్వీట్స్ ఇచ్చాడు ఆ విద్యార్థి.

'నీ కృషి, పట్టుదలే నీ ఉత్తీర్ణతకి కారణాలు మధ్య నాదేముందయ్యా' స్వీటు తీసుకుంటూ అన్నాడు మురళి.

'మా స్నేహితుల ఎగతాళికి నన్ను గురికాకుండా చేశారు. మా పేరెంట్స్ కూడా చాలా సంతోషించారు సార్, ఇంతకీ ఆ మాత్రల పేరేంటి సార్?'

'నిద్రరాకుండా మాత్రలు లేవు. అటువంటివి ఉన్నా ఆరోగ్యానికి హానికరం' ఇంకా ఏదో చెప్పబోయాడు.

'మరి నాకిచ్చిన మాత్రలు... అర్థోక్తిలో ఆగిపోయాడు.

ఏం చెపుతాడా అని పరాంకుశం గారు కూడా మురళి వంక చూశారు.

'నీ ఒంటి బలహీనతే నీ నిద్రకు ముఖ్యకారణం. అదీగాక మాత్రవేసుకుంటే నిద్ర రాదు, అన్న నమ్మకంతో నువ్వు ఆ మాత్రలపై ఆధారపడ్డావు. అందుకే నీకు బి కాంప్లెక్స్ మాత్రలు ఇచ్చాను. మాత్రల మీద పూర్తి విశ్వాసంతో, నామీద నమ్మకంతో నీవు పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యావు' నవ్వుతూ చెప్పాడు.

ఆ విద్యార్థితో పాటు, పరాంకుశం గారు కూడా నిర్ఘాంతపోయారు. మానసిక ప్రభావం కూడా ఒకరకమైన మందేనని తెలుసుకున్నారు.